
సాక్షి
బాపట్ల
ఆదివారం । 24 । ఆగస్టు । 2025



శనైశ్వరునికి పూజలు

మంగళగిరి:మంగళాద్రిలోని భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి దేవస్థానం ఆవరణలో ఉన్న శనైశ్వరునికి శనివారం అమావాస్య పూజలు నిర్వహించారు.



పులిచింతల ప్రాజెక్టు సమాచారం

అచ్చంపేట: ఎగువ నుంచి పులిచింతల ప్రాజెక్టుకు 3,82,100 క్యూసెక్కులు వచ్చి చేరుతుండగా దిగువకు 3,81,655 క్యూసెక్కులు వదులుతున్నారు. ప్రస్తుతం నీటి మట్టం 33.1400 టీఎంసీలు.

రచయిత ప్రభావతి నియామకం



భట్టిప్రోలు: భట్టిప్రోలుకు చెందిన ప్రముఖ కవి, రచయిత దొంతు ప్రభావతిని ఉమ్మడి గుంటూరు జిల్లా మహిళా అధ్యక్షురాలిగా నియమిస్తూ విశ్వ సాహితీ కళావేదిక చైర్మన్ కె.రమావతి శనివారం ఉత్తర్వులను జారీ చేశారు.

పొగాకు సాగును అడ్డుకునేందుకు టాస్క్‌ఫోర్స్



పొగాకు తోట (ఫైల్)

సాక్షి ప్రతినిధి, బాపట్ల : బాపట్ల జిల్లాలో సాగుచేసే బ్లాక్, వైట్ బర్లీ పొగాకుపై కూటమి ప్రభుత్వం నిషేధం విధించింది. ఆదేశాలు ఉల్లంఘిస్తే పంటను ట్రాక్టర్లు పెట్టి దున్నేస్తామని హెచ్చరించింది. తాజాగా నిషేధం అమలుకు అధికారులతో ఏకంగా టాస్క్‌ఫోర్సులు ఏర్పాటు చేస్తున్నారు. జిల్లా స్థాయిలో కలెక్టర్, ఎస్పీతోపాటు వ్యవసాయశాఖ అధికారి కమిటీలో ఉండగా, డివిజనల్ స్థాయిలో ఆర్డీవో, డీఎస్పీ, ఏడీ స్థాయి అధికారులు, మండల స్థాయిలో తహసీల్దారు, సీఐ, వ్యవసాయాధికారులతోపాటు ఇతర అధికారులు టాస్క్‌ఫోర్సులో సభ్యులుగా ఉండి సాగును అడ్డుకుంటారు. ఎట్టి పరిస్థితిలోనూ ఈ ఏడాది సాగు చేయకూడదని జిల్లా కలెక్టర్ హెచ్చరించారు.

నిషేధం పెట్టడం సరికాదు



రైతులు సాగు చేసే పొగాకు పంటను గిట్టుబాటు ధర ఇచ్చి కొనుగోలు చేయకుండా అసలు పంటే సాగుచేయవద్దని ప్రభుత్వం చెప్పడం సరికాదు. గత ప్రభుత్వంలో రైతులకు గిట్టుబాటు ధర ఇచ్చి పొగాకు కొన్నారు. తెగుళ్ల తక్కువని, గిట్టుబాటు అవుతుందని పొగాకు వేస్తే కొనకుండా కంపెనీలు మోసం చేశాయి. ప్రభుత్వమన్నా పొగాకు కొని ఆదుకుంటుందనుకుంటే ఆపని చేయకుండా పంటే సాగుచేయొద్దని చెప్పడం దుర్మార్గం.

– బొల్లా రామాంజనేయులు, పొగాకు రైతు, పంగులూరు

రైతులకు ఏది గిట్టుబాటో అది చేయాలి



పొగాకు గిట్టుబాటు అవుతుండడంతో ఆ పంట సాగు చేస్తున్నాం. ఆ పంట సాగుచేయవద్దని చెప్పడం సరికాదు. మిర్చి సాగుచేసి పెట్టుబడులు కూడా రాక తీవ్రంగా నష్టపోయాం. కాస్త గిట్టుబాటు ఉంటుందని పొగాకు వేస్తే ఈ ఏడాది అటు కంపెనీలు, ఇటు ప్రభుత్వం సక్రమంగా కొనక మోసం చేశాయి. పొగాకు సాగు వద్దని చెప్పినప్పుడు వేరే పంటలకు మద్దతు ధర ఇస్తామని ప్రభుత్వం మాట ఇవ్వాలి.

– గనిపిశెట్టి వెంకట్రావు, రైతు, చిమటవారిపాలెం

పొగాకు పంట సాగుపై తాత్కాలికంగా నిషేధం

జిల్లా కలెక్టర్ జి.వెంకట మురళి

బాపట్ల: బ్లాక్ బర్లీ, వైట్ బర్లీ పొగాకు పంట సాగును తాత్కాలికంగా నిషేధించినట్లు జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి తెలిపారు. ప్రభుత్వం అధికారికంగా జీఓ ఆర్‌టి నెంబర్ 740 జారీ చేసిందన్నారు. వ్యవసాయ, రెవెన్యూ, పోలీస్ శాఖల అధికారులతో స్థానిక కలెక్టర్ క్యాంప్ కార్యాలయం నుంచి శనివారం ఆయన వీక్షణ సమావేశం నిర్వహించారు. ఏడాదిపాటు పొగాకు సాగు నిషేధించినట్లు తెలిపారు. రైతులంతా ప్రత్యామ్నాయ పంటలవైపు దృష్టి సారించాలన్నారు. ప్రస్తుత పరిస్థితులను పరిగణనలోకి తీసుకుని ప్రభుత్వం తాత్కాలికంగా నిషేధాజ్ఞలు విధించిందన్నారు. ఈ విషయాలపై అన్ని గ్రామాలలో టామ్ టామ్ వేయించాలన్నారు. పొగాకు పంట వేయకుండా రైతులకు అవగాహన కల్పించాలన్నారు. గ్రామ, మండల, డివిజన్, జిల్లా స్థాయిలో ఎన్‌ఫోర్స్‌మెంట్ టీములను నియమించామన్నారు. జిల్లా స్థాయి కమిటీలో జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీ, సంయుక్త కలెక్టర్, వ్యవసాయ శాఖ అధికారి, వైద్య ఆరోగ్యశాఖ అధికారి, లా అధికారి పనిచేస్తారన్నారు. నియమించిన బృందాలు క్షేత్రస్థాయిలో నిరంతరం నిఘా ఉంచాలన్నారు. ఒక్క ఎకరా పొగాకు పంట వేయకుండా చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత వ్యవసాయ శాఖ అధికారులు, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులపై ఉందన్నారు. ఎక్కడైనా రహస్యంగా పొగాకు పంటలు సాగు చేస్తే వెంటనే పెరికి వేయాలన్నారు. నర్సరీలలో పొగనారు వేసినా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. పొగాకు రైతులు ప్రత్యామ్నాయ పంటలు సాగు చేయడానికి అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఇన్‌చార్జి సంయుక్త కలెక్టర్ జి.గంగాధర్ గౌడ్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి సుబ్రహ్మణ్యేశ్వరరావు, ఏడీ అన్నపూర్ణ, ఆర్డీవోలు, తహసీల్దార్లు, పోలీస్ అధికారులు, వ్యవసాయ శాఖ అధికారులు, వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.

పొగాకు కొనుగోలు కేంద్రం వద్ద రైతుల ధర్నా



కర్లపాలెంలోని పొగాకు కొనుగోలు కేంద్రం వద్ద ధర్నా నిర్వహిస్తున్న రైతులు



రైతులతో మాట్లాడుతున్న స్పెషల్ డెప్యూటీ కలెక్టర్ లవన్న

కర్లపాలెం: పొగాకు కొనుగోలు చేయటం ద్వారా రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి సీహెచ్ గంగయ్య కోరారు. కౌలు రైతులు, రైతు సంఘాల ఆధ్వర్యంలో శనివారం కర్లపాలెం ఎఫ్‌సీఐ గోడౌన్‌లో ఏర్పాటుచేసిన పొగాకు కొనుగోలు కేంద్రం వద్ద ధర్నా నిర్వహించారు. సీపీఎం జిల్లా కార్యదర్శి గంగయ్య మాట్లాడుతూ ఎన్నో ప్రయాసల కోర్చి పొగాకు సాగు చేసిన రైతులకు కన్నీరే మిగులుతుందని అన్నారు. రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన పొగాకు కొనుగోలు కేంద్రాలలో గిట్టుబాటు ధరలు లభించటం లేదని అన్నారు. అడుసుమల్లి నుంచి రైతులు 40 క్వింటాళ్ల పొగాకు తీసుకువస్తే నాణ్యత సరిగాలేదని 22 క్వింటాళ్లు వెనక్కి పంపారని చెప్పారు. సాధారణ నాణ్యత ఉన్న పొగాకు రూ.6వేలకు, మీడియం రకం రూ.9 వేలకు, ఎ గ్రేడ్ రకం రూ.12 వేలకు కొనుగోలు చేయాల్సి ఉండగా కనీసం మీడియం రకం ధర కూడా ఇవ్వటం లేదని మండిపడ్డారు. రైతులు తీసుకువచ్చిన పొగాకు సకాలంలో కొనుగోలు చేయకపోవటంతో రోజుల తరబడి ట్రాక్టర్‌లలో పట్టాలు వేసి ఉంచటం వలన మరింత నష్టం వాటిల్లుతుందన్నారు. సీపీఎం నాయకులు జాలాది విజయరావు, కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి పి.కొండయ్య తదితరులు పాల్గొన్నారు.

కొనుగోళ్లు ముమ్మరం చేయాలి

రైతులు తీసుకువచ్చిన పొగాకును ముమ్మరంగా కొనుగోలు చేయాలని టొబాకో స్పెషల్ డెప్యూటీ కలెక్టర్ లవన్న ఆదేశించారు. కౌలు రైతులు, రైతు సంఘాలు ధర్నా చేస్తున్నారని తెలుసుకున్న లవన్న పొగాకు కొనుగోలు కేంద్రం వద్దకు వచ్చి రైతులతో, కొనుగోలు కేంద్రం అధికారులతో చర్చలు జరిపారు. పొగాకు నాణ్యతను బట్టి గిట్టుబాటు ధర కల్పించే విధంగా తగిన చర్యలు తీసుకుంటామని రైతులకు హామీ ఇచ్చారు. ఆయన వెంట తహసీల్దార్ షాకీర్ పాషా, టొబాకో ప్రొక్యూర్‌మెంట్ డీఎం కరుణశ్రీ ఉన్నారు.

ఆర్జిత సేవలకు డిమాండ్



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): శ్రావణ అమావాస్య నేపథ్యంలో ఇంద్రకీలాద్రిపై దుర్గామల్లేశ్వర స్వామి వార్లకు నిర్వహించిన పలు ఆర్జిత సేవల్లో ఉభయదాతలు విశేషంగా పాల్గొన్నారు. తెల్లవారుజామున ఖడ్గమాలార్చన, లక్ష కుంకుమార్చన, శ్రీచక్ర నవార్చన, శాంతి కల్యాణం, చండీహోమాలలో ఉభయదాతలు అధిక సంఖ్యలో పాల్గొని తమ నామగోత్రాలతో పూజలు జరిపించుకున్నారు. ఇక శ్రావణ మాసాన్ని పురస్కరించుకుని నెల రోజుల పాటు నిర్వహించిన ప్రత్యేక కుంకుమార్చనలు శనివారంతో ముగిశాయి. శనివారం కూడా పెద్ద ఎత్తున భక్తులు ఆలయానికి తరలివచ్చి ప్రత్యేక కుంకుమార్చనలు జరిపించుకున్నారు. సాయంత్రం పంచ హారతుల సేవ, పల్లకీ సేవలో భక్తులు విశేషంగా పాల్గొన్నారు. అమ్మవారి దర్శనానికి విచ్చేసిన భక్తులతో క్యూలైన్లు కిటకిటలాడాయి.

నూతన అన్నదాన భవన పరిశీలన

రాజగోపురం ఎదుట నూతనంగా నిర్మిస్తున్న అన్నదాన భవనాన్ని ఈవో శీనానాయక్ ఇంజినీరింగ్ అధికారులతో కలిసి పరిశీలించారు. దసరా ఉత్సవాల నాటికి అన్నదాన భవనం అందుబాటులోకి తీసుకురావాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. క్లోక్‌రూమ్, సెల్‌ఫోన్ కౌంటర్‌ను తనిఖీ చేసిన ఈవో సిబ్బందికి పలు సూచనలు ఇచ్చారు. కనకదుర్గనగర్‌లో నిర్మిస్తున్న సమాచార కేంద్రాన్ని పరిశీలించారు. ఈవో వెంట ఈఈ రాంబాబు, ఏఈ మస్తాన్, సునీల్ పాల్గొన్నారు.

పశ్చిమ డెల్టాకు 7,508 క్యూసెక్కులు విడుదల

దుగ్గిరాల: విజయవాడ ప్రకాశం బ్యారేజ్ నుంచి ఆదివారం 7,508 క్యూసెక్కులు విడుదల చేసినట్లు నీటి పారుదల శాఖ అధికారులు తెలిపారు. బ్యారేజ్ వద్ద 12 అడుగులు నీటి మట్టం ఉంది. దుగ్గిరాల సబ్ డివిజన్ హైలెవెల్‌కు 306, బ్యాంక్ కెనాల్ 1,861, తూర్పు కాలువకు 728, పశ్చిమ కాలువకు 302, నిజాంపట్నం కాలువకు 486, కొమ్మూరు కాలువకు 2,960 క్యూసెక్కులు విడుదల చేశారు.

న్యూస్‌రీల్

మట్టి విగ్రహాలతో పర్యావరణానికి మేలు



గుంటూరు వెస్ట్: ఈ ఏడాది వినాయక చవితి పండుగ సందర్భంగా అందరూ మట్టితో చేసి, సహజ రంగులు వాడే గణనాథుని విగ్రహాలను ప్రతిష్ఠించుకోవాలని జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి పిలుపునిచ్చారు. ఏపీ పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ ఆధ్వర్యంలో ప్రత్యేకంగా తయారు చేసిన అవగాహన పోస్టర్‌ను కలెక్టర్‌తోపాటు డీఆర్వో షేక్ ఖాజావలి, పర్యావరణ ఇంజినీర్ ఎండీ నజీమా బేగం, సీపీఓ శేషశ్రీ శనివారం స్థానిక కలెక్టరేట్‌లోని కలెక్టర్ చాంబర్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పర్యావరణాన్ని కాపాడుకోవాలంటే కొన్ని నిబంధనలు పాటించాలన్నారు. మట్టి వినాయకుడిని పూజించి అందరూ బాధ్యతను చాటుకోవాలన్నారు.

అదాలత్‌లో ఎక్కువ కేసులు పరిష్కారమయ్యేలా చూడాలి



తెనాలిరూరల్:సెప్టెంబర్ 13వ తేదీన నిర్వహించనున్న జాతీయ లోక్‌అదాలత్‌లో ఎక్కువ కేసులు పరిష్కారమయ్యేలా చూడాలని 11వ అదనపు జిల్లా న్యాయమూర్తి డి.శ్రీనివాసులు న్యాయవాదులను కోరారు. ఎం.ఇందిరా ప్రియదర్శిని, ఎం.శ్రీధర్, పవన్‌కుమార్, పి.రాజశేఖర్‌లతో కలసి న్యాయమూర్తి శ్రీనివాసులు తెనాలి కోర్టు సముదాయంలో శనివారం సమావేశమయ్యారు. లోక్ అదాలత్‌లో కేసులు రాజీపడితే కోర్టు ఫీజులు వాపసు వస్తాయని, కక్షిదారులకు దీనిపై అవగాహన కల్పించాలని సూచించారు. రాజీ అయ్యే వీలున్న కేసులను అదాలత్‌లో పరిష్కరించుకునేలా అవగాహన కల్పించాలన్నారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బేతాళ ప్రభాకర్, కార్యదర్శి హరిదాసు గౌరీశంకర్, సీనియర్, జూనియర్ న్యాయవాదులు, మండల లీగల్ సర్వీసెస్ కార్యాలయ సూపరింటెండెంట్ మహబూబ్ పాల్గొన్నారు.

కాంట్రాక్టు సంస్థలు నిబంధనలు పాటించాలి

తాడికొండ: రాజధానిలో పనిచేసే కాంట్రాక్టు సంస్థలు నిబంధనలు పాటిస్తూ కార్మికులు ప్రమాదాల బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని తుళ్లూరు డీఎస్పీ మురళీకృష్ణ సూచించారు. శనివారం తుళ్లూరు పోలీస్‌స్టేషన్‌లో రాజధాని నిర్మాణంలో పాలు పంచుకునే వివిధ కాంట్రాక్టు సంస్థల ప్రతినిధులతో ఆయన సమావేశం ఏర్పాటుచేశారు. అందరూ హాజరు కాకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వేల సంఖ్యలో కార్మికులు ఉన్నందున ఎలాంటి అవాంఛనీయ ఘటనలు తలెత్తకుండా చూడాల్సిన బాధ్యత తమపై ఉందన్నారు.

ఆలయ నిర్మాణానికి రూ.లక్ష విరాళం



నరసరావుపేటరూరల్: ఇస్సపాలెం శ్రీ మహంకాళి అమ్మవారి ఆలయ పునర్నిర్మాణానికి పట్టణానికి చెందిన పూనూరి కోటిరెడ్డి, రమాదేవి దంపతులు రూ.1,01,116 విరాళంగా అందజేశారు. ఆలయంలో శనివారం ఈవో నలబోతు మాధవిదేవిని కలిసి విరాళం చెక్కు దాతలు అందజేశారు. పూనూరి కోటిరెడ్డి దంపతుల కుమారుడు వేణుగోపాలరెడ్డి, కుమార్తె ప్రియాంక, పూదోట కిరణ్, ఆలయ అర్చకులు కొత్తలంక కార్తికేయశర్మ, నండూరి కాశీకృష్ణలు పాల్గొన్నారు.

సెప్టెంబర్ 7న చంద్రగ్రహణం

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): సెప్టెంబర్ 7వ తేదీ రాత్రి రాహుగ్రస్త పాక్షిక చంద్రగ్రహణాన్ని పురస్కరించుకుని అమ్మవారి ఆలయాన్ని కవాట బంధనం(తలుపులు మూసివేయడం) జరుగుతుందని దేవస్థాన వైదిక కమిటీ పేర్కొంది. 7వ తేదీ రాత్రి 9:56 గంటల నుంచి అర్ధరాత్రి 1:26 గంటల వరకు గ్రహణ కాలంగా పేర్కొన్నారు. చంద్రగ్రహణాన్ని పురస్కరించుకుని 7వ తేదీ మధ్యాహ్నం 3:30 గంటలకు అమ్మవారి ప్రధాన ఆలయంతో పాటు మల్లేశ్వర స్వామి వారి ఆలయం, ఇంద్రకీలాద్రిపై ఇతర ఉపాలయాల తలుపులు మూసివేస్తారన్నారు. 8వ తేదీ తెల్లవారుజామున 3 గంటలకు ఆలయ ద్వారాలను తెరిచి సంప్రోక్షణ, స్నపనాభిషేకం, అనంతరం అర్చన, మహానివేదన, హారతి అనంతరం ఉదయం 8:30 గంటలకు భక్తులను దర్శనానికి అనుమతిస్తారన్నారు.

అద్దె దుకాణాల కూల్చివేతపై ఆవేదన

- సమయం అడిగినా కనికరించలేదని వాపోయిన బాధితులు
- ఫిర్యాదు చేయడానికి వెళితే పోలీసులు కనీసం స్పందించలేదని ఆరోపణ
- నడి రోడ్డున పడ్డామని బాధిత కుటుంబాలు కన్నీటిపర్యంతం



జేసీబీతో షాపులు కూల్చివేయిస్తున్న కృష్ణవేణి తరఫు వ్యక్తులు

లక్ష్మీపురం (గుంటూరు వెస్ట్): ప్రతి నెల అద్దెలు చెల్లిస్తూ వస్తున్న వారిపై దుకాణ యజమాని మనవరాలు దౌర్జన్యానికి దిగారు. షాపులను ఖాళీ చేయాలంటూ రౌడీమూకతో కలిసి ఏకంగా జేసీబీ తీసుకొచ్చి షాపులను కూల్చివేయించారు. ఈ ఘటన శనివారం ఎస్.వి.ఎన్. కాలనీలో చోటుచేసుకుంది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. కాలనీ 4వ లైను ప్రధాన రహదారి మార్గంలో విజయవాడకు చెందిన వెంకటయ్య చౌదరి అనే వ్యక్తికి 778 గజాల స్థలంలో ముందు భాగంలో షాపులు, వెనుక ఇళ్లు ఉన్నాయి. ఇక్కడ 35 సంవత్సరాల క్రితం కాలనీకి చెందిన రామచంద్రరావు షాపు అద్దెకు తీసుకుని సూపర్ మార్కెట్ ఏర్పాటు చేశారు. దీంతోపాటు బ్యాటరీ దుకాణం, సెలూన్ ఏర్పాటు అయ్యాయి. మూడు కుటుంబాలు ఇక్కడే ఉంటున్నాయి. వెంకయ్య చౌదరికి నెలకు వీరందరూ రూ.35 వేల చొప్పున అద్దె చెల్లిస్తూ వచ్చారు. వీటికి కరెంటు బిల్లులు, మున్సిపాలిటీ పన్నులు తదితరాలను రామచంద్రరావు చెల్లిస్తున్నారు. వెంకయ్య చౌదరికి సంతానం లేకపోవడంతో తూమాటి కృష్ణవేణిని దత్తత తీసుకున్నారు. కృష్ణవేణికి వివాహమై, ఇద్దరు సంతానం ఉన్నారు. వెంకయ్య చౌదరి తన స్నేహితుడైన శ్రీనివాస్, పద్మజలను ఈ ఆస్తికి గార్డియన్లుగా పెట్టారు. 2017లో వెంకయ్య చౌదరి మృతి చెందారు. అప్పటి నుంచి శ్రీనివాస్‌కే అద్దెలు చెల్లిస్తున్నారు. గత జనవరిలో కృష్ణవేణి వచ్చి అద్దెల నగదు తనకు ఇవ్వాలని చెప్పడంతో వారు అదే విధంగా చేస్తున్నారు.

సమయం అడిగినా..

రెండు నెలల క్రితం కృష్ణవేణి వచ్చినప్పుడు దుకాణాలు ఖాళీ చేయాలని, ఈ స్థలం విక్రయించామని చెప్పారు. రెండు నెలల్లో ఖాళీ చేయడం కష్టమని, కనీసం ఏడాదైనా టైం కావాలని చెప్పారు. అవేమీ పట్టించుకోకుండా ఎలాగైనా ఖాళీ చేయాలని హుకుం జారీ చేసి వెళ్లారు. అద్దెదారులు దిక్కుతోచని స్థితిలో ఉండిపోయారు. స్థలం విలువ ఎంతో చెబితే తామే కొనుగోలు చేసుకుంటామని వారందరూ కోరారు. ఆలోచించుకుని చెబుతామని కృష్ణవేణి వెళ్లిపోయారు. ఈ నెల 17వ తేదీన మళ్లీ వచ్చి దౌర్జన్యంగా షాపులకు తాళాలు వేశారు. బాధితులు పట్టాభిపురం పోలీసులను ఆశ్రయించినా ఫలితం లేకుండాపోయింది. అద్దెకు ఉన్నవారు ఖాళీ చేయాలని స్టేషన్ అధికారి చెప్పారని బాధితులు వాపోయారు. ఈ నెల 18వ తేదీన జిల్లా ఎస్పీ కార్యాలయంలో గ్రీవెన్స్‌లోనూ వారు ఫిర్యాదు చేశారు. పట్టాభిపురం పోలీసులు కనీసం స్పందించలేదు. శనివారం మధ్యాహ్నం కృష్ణవేణి కుమార్తెనంటూ భూమిక అనే యువతి మరి కొంత మందితో వచ్చారు. జేసీబీతో షాపులు కూల్చివేయించారు. అడ్డుకునే యత్నం చేసే వారిపై మహిళలు, చిన్నారులు ఉన్నారని కూడా చూడకుండా బెదిరింపులకు దిగారు. బాధితులు ఫోన్ చేయగా పట్టాభిపురం హెడ్ కానిస్టేబుల్ వచ్చి గొడవ జరగలేదుగా అంటూ తిరిగి వెళ్లిపోయారని వారు తెలిపారు. కుటుంబాలతో రోడ్డున పడ్డామని ఆవేదన చెందుతున్నారు.



ఆవేదన వ్యక్తం చేస్తున్న బాధిత కుటుంబాలు

తాడికొండ ఎమ్మెల్యే పేరు చెబుతున్నారు..



కాలనీలోని ఈ స్థలాన్ని సుమారు రూ.5.5 కోట్లకు తాడికొండ టీడీపీ ఎమ్మెల్యే సన్నిహితుడైన బత్తుల సురేష్‌కు విక్రయించామని భూమిక అనే యువతి చెప్పారు. బత్తుల సురేష్ బావమరిది జె.పి. అనే వ్యక్తి చేతుల్లోకి ఈ స్థలం వెళ్లిపోయిందంటూ కనీస సమయం కూడా ఇవ్వకుండా జేసీబీతో దుకాణాలు కూల్చివేయించారు. జేపీ అనే వ్యక్తి తరచు సూపర్ మార్కెట్‌లో సరుకులు కొనుగోలు చేసే కస్టమరే. మాకు తెలియని వ్యక్తి కాదు. ఈ ప్రాంతంలో 35 ఏళ్లుగా వ్యాపారం చేసుకుంటున్నాం. పోలీసులకు ఫిర్యాదు చేసినా, సోమవారం గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేసినా ఎవరూ పట్టించుకోలేదు. మాకు ఎవరు న్యాయం చేస్తారు? ఎక్కడ న్యాయం జరుగుతుంది? సూపర్ మార్కెట్‌లో రూ.లక్షల విలువ చేసే సరుకులు ఉన్నాయి. ఇక్కడి వారందరికీ న్యాయం చేయాలి.

– రామచంద్రరావు, సూపర్ మార్కెట్ నిర్వాహకుడు

స్వచ్ఛ ఆంధ్రలో ప్రజలు భాగస్వామ్యం కావాలి

జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి



చెత్త తొలగిస్తున్న జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి

బాపట్ల: స్వచ్ఛ ఆంధ్ర, స్వర్ణాంధ్ర కార్యక్రమంలో ప్రజలందరూ భాగస్వామ్యం కావాలని జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి పిలుపునిచ్చారు. శనివారం స్థానిక కలెక్టరేట్‌లో నిర్వహించిన స్వచ్ఛ ఆంధ్ర–స్వర్ణాంధ్ర కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి, బాపట్ల ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ పాల్గొన్నారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం పరిసరాల పరిశుభ్రత కోసం స్వచ్ఛ ఆంధ్ర–స్వర్ణాంధ్ర కార్యక్రమాన్ని చేపట్టిందని తెలిపారు. కలెక్టరేట్ ప్రాంగణం 57 ఎకరాల మేర భూమి ఉందని ఈ ప్రాంతాన్ని శుభ్రం చేయడానికి చర్యలు చేపట్టామని చెప్పారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్వచ్ఛ ఆంధ్ర–స్వర్ణాంధ్ర దిశగా అనేక కార్యక్రమాలు చేపడుతున్నాయని అన్నారు. అక్టోబర్ 2 గాంధీ జయంతి సందర్భంగా స్వచ్ఛ ఆంధ్ర–స్వర్ణాంధ్ర కార్యక్రమాన్ని విస్తృతంగా చేపట్టిన సంస్థలకు అవార్డుల ప్రదానోత్సవం చేస్తామని చెప్పారు. జిల్లాలోని ప్రభుత్వ కార్యాలయాల్లో, పాఠశాలల్లో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో, హాస్టళ్లలో స్వచ్ఛంద స్వర్ణాంధ్ర కార్యక్రమాలు చేపట్టాలని చెప్పారు. స్వచ్ఛ ఆంధ్ర–స్వర్ణాంధ్ర కార్యక్రమంలో ఉత్తమ ప్రతిభ చూపిన వారికి రాష్ట్ర ప్రభుత్వం అవార్డులు ప్రదానం చేస్తుందని చెప్పారు. కలెక్టరేట్ ప్రాంగణంలో జిల్లా కలెక్టర్ వెంకటమురళి, ఎమ్మెల్యే నరేంద్ర వర్మ వెయ్యి మొక్కలు నాటారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి గంగాధర్‌గౌడ్, జిల్లా పంచాయతీ అధికారి ప్రభాకర్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి విజయమ్మ, జిల్లా రవాణాశాఖ అధికారి పరంధామరెడ్డి, ఎక్సైజ్ అధికారి ఎస్ వెంకటేశ్వరరావు, గృహనిర్మాణ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ వెంకటేశ్వరావు, జిల్లా ప్రణాళిక అధికారి షాలేం రాజు, బాపట్ల ఆర్డీఓ గ్లోరియా, మున్సిపల్ కమిషనర్ రఘునాథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

స్వామిత్వ సర్వే పనులను శరవేగంగా పూర్తి చేయాలి

స్వామిత్వ సర్వే పనులను అధికారులు శరవేగంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి ఆదేశించారు. స్వామిత్వ సర్వే, పి 4 అమలు, ప్రభుత్వ సేవలపై ప్రజాభిప్రాయం వంటి అంశాలపై డివిజన్, మండల స్థాయి అధికారులతో శనివారం స్థానిక కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి ఆయన వీక్షణ సమావేశం ద్వారా మాట్లాడారు. చీరాల, వేటపాలెం, ఇంకొల్లు, చిన్నగంజాం, రేపల్లె, కర్లపాలెం, పి.వి పాలెం, పర్చూరు, మార్టూరు, చెరుకుపల్లి, రేపల్లె, నగరం, చుండూరు మండలాల్లో స్వామిత్వ సర్వే ఆశించిన స్థాయిలో జరగడంలేదని అసహనం వ్యక్తం చేశారు. ఆ ప్రాంతాలలో సిబ్బంది పనితీరు మార్చుకోకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు. సర్వే పురోగతికి డీఎల్‌డీఓలు బాధ్యులని స్పష్టం చేశారు. స్వామిత్వ సర్వేపై ప్రతిరోజూ మండల స్థాయిలో సమీక్షలు జరగాలన్నారు.

పర్యాటక దినోత్సవాన్ని వైభవంగా నిర్వహించాలి

పర్యాటక దినోత్సవాన్ని వైభవంగా జరపడానికి అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ వెంకట మురళి చెప్పారు. జిల్లాలో సూర్యలంక బీచ్ లో బీచ్ ఫెస్టివల్ ఘనంగా నిర్వహిస్తున్న విషయాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలన్నారు. సమావేశంలో ఇన్‌చార్జి సంయుక్త కలెక్టర్ జి.గంగాధర్ గౌడ్, సర్వే ల్యాండ్స్ రికార్డ్స్ ఏడీ కనక ప్రసాద్, ఆర్డీవోలు, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

వివాహేతర సంబంధం నేపథ్యంలో వ్యక్తి హత్య

- నెహ్రూనగర్ సమీపంలో హత్య
- మృతుడు గుంటూరుకు చెందిన ప్రదీప్‌గా గుర్తించిన పోలీసులు

బొల్లాపల్లి: వివాహేతర సంబంధం నేపథ్యంలో ఓ వ్యక్తి హత్యకు గురైన సంఘటన బొల్లాపల్లి మండలం వెల్లటూరు గ్రామ పరిధిలోని నెహ్రూనగర్ తండాకు వెళ్లే రహదారిలో జరిగింది. బండ్లమోటు, నల్లపాడు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... గుంటూరు నగరం గోరంట్లలోని మేరీ ప్రియనగర్‌కు చెందిన మున్నంగి ప్రదీప్(43) హత్యకు గురయ్యాడు. ఈనెల 20న మాదల సాంబశివరావు, మున్నంగి ప్రదీప్ కలసి ఆటోలో బొల్లాపల్లి మండలం వెల్లటూరు గ్రామ పరిధిలోని నెహ్రూనగర్ వెళ్లే రోడ్డులోకి వచ్చి పూటుగా మద్యం సేవించారు. ప్రదీప్‌ను హత్యగావించిన అనంతరం సాంబశివరావు ఆటోలో తన స్వస్థలం గుంటూరు వెళ్లాడు. నల్లపాడు పోలీస్‌స్టేషన్‌లో ప్రదీప్ మిస్సింగ్ కేసు నమోదయింది. అనుమానంతో సాంబశివరావును అదుపులోకి తీసుకొని విచారించగా విషయం వెలుగు చూసింది. వివాహేతర సంబంధం నేపథ్యంలో హత్య జరిగిందని నల్లపాడు ఎస్సై రామకృష్ణ తెలిపారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మృతునికి భార్య మరియమ్మ ఇరువురు సంతానం ఉన్నారు. మృతదేహాన్ని బండ్లమోటు పోలీసుల ఆధ్వర్యంలో సంఘటన ప్రాంతంలో పోస్టుమార్టం నిర్వహించారు. అనంతరం కుటుంబ సభ్యులకు అందజేశారు. సంఘటన ప్రాంతాన్ని గుంటూరు సబ్ డివిజనల్ పోలీస్ అధికారి జి భానోదయ సందర్శించి పరిశీలించి విచారణ చేపట్టారు.

● తగ్గని వరద ఉధృతి



అమరేశ్వరఘాట్ వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న కృష్ణానది

అమరావతి: కృష్ణా నదిలో వరద ఉధృతి ఇంకా తగ్గలేదు. అమరావతి వద్ద శనివారం కూడా కృష్ణమ్మ ఉధృతంగా ప్రవహిస్తోంది. ఇటీవల కురిసిన వర్షాలకు లోతట్టు ప్రాంతాలలో నిలిచిన నీరు కృష్ణా నదిలోకి చేరాల్సి ఉంది. కానీ నదీ ప్రవాహం ఉధృతంగా ఉండటంతో ఎక్కడికక్కడే నీరు నిలిచిపోయింది. అమరావతి–విజయవాడ రోడ్డులో పెదమద్దూరు వద్ద వాగు చప్టాపై ఇంకా రెండు అడుగుల మేర నీరు ప్రవహిస్తోంది. చప్టా శిథిలావస్థలో ఉండటం వల్ల అధికారులు రాకపోకలు నిలిపివేశారు. అమరావతి నుంచి విజయవాడ వెళ్లే బస్సులు పెదమద్దూరు వరకు నడుపుతున్నారు. విజయవాడ వెళ్లాలంటే ఆటోలో నరుకుళ్లపాడు ఎండ్రాయి, చావపాడు గ్రామాల మీదుగా సుమారు 10 కిలోమీటర్లు చుట్టూ తిరిగి రావాల్సి వస్తుండటంతో ప్రయాణికులు, వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు.

యూరియా కొరత లేదనడం హాస్యాస్పదం



ఫిరంగిపురం: వ్యవసాయ పనులు ప్రారంభమైనప్పటికీ రైతులకు యూరియా అందుబాటులోకి రాలేదని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ఈమని అప్పారావు పేర్కొన్నారు. మండల కేంద్రంలో శనివారం వ్యవసాయ కార్మికసంఘం సమావేశం నిర్వహించారు. అప్పారావు మాట్లాడుతూ యూరియా కొరతతో రైతులు ఇక్కట్లు పడుతుంటే అధికారులు మాత్రం కొరత లేదని చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఉపాధి హామీ కూలీలకు బకాయి వేతనాలు వెంటనే చెల్లించాలన్నారు. పనులు నిర్వహించి రెండు నెలలు గడుస్తున్నా ఇంతవరకు వేతనాలు ఇవ్వలేదని తెలిపారు. వ్యవసాయ పనులు లేక వారు నానా ఇక్కట్లు పడుతున్నారని చెప్పారు. సీఐటీయూ మండల కార్యదర్శి షేక్, మస్తాన్‌వలి, ఎ.అంకారావు, నాయకులు, రైతులు పాల్గొన్నారు.

కృష్ణానదిలోకి దూకి మహిళ ఆత్మహత్య



విజయభార్గవి మృతదేహం



చిన్నారి అనేక్య

తాడేపల్లి రూరల్: తాడేపల్లి సీతానగరం ప్రకాశం బ్యారేజ్ వద్ద ఓ మహిళ కృష్ణానదిలోకి దూకి ఆత్మహత్య చేసుకున్న ఘటన శనివారం చోటుచేసుకుంది. తాడేపల్లి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సీతానగరం ఘాట్ వద్దకు శనివారం మధ్యాహ్నం 3 గంటలకు విజయభార్గవి (28) అనే మహిళ తన కుమార్తె అనేక్యతో కలసి వచ్చింది. భార్గవి కృష్ణానదిలోకి దూకడంతో స్థానికులు గమనించి సమాచారం అందించారని తెలిపారు. పోలీసులు వెళ్లి మృతదేహాన్ని వెలికితీసి పోస్ట్‌మార్టం నిమిత్తం మంగళగిరి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు పేర్కొన్నారు. పాప తన తండ్రి పేరు నరేష్ అని మాత్రమే చెబుతోందని, ఊరు పేరు చెప్పలేకపోయిందని తెలిపారు. ఎవరికైనా వివరాలు తెలిస్తే తాడేపల్లి పోలీస్‌స్టేషన్ ఫోను నంబర్లు 86888 31361, 81438 73409, 97034 52206లకు సమాచారం ఇవ్వాలని పోలీసులు చెప్పారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ సతీష్ పేర్కొన్నారు. అనేక్యను విజయవాడలో చైల్డ్ వెల్ఫేర్ కమిటీకి అప్పగించినట్లు తెలిపారు.

అపూర్వ ధైర్యశాలి టంగుటూరి



టంగుటూరి ప్రకాశం చిత్రపటానికి నివాళులర్పిస్తున్న జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్



ప్రకాశం పంతులు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న జెడ్పీ సీఈవో జ్యోతిబసు, డిప్యూటీ సీఈవో కృష్ణ, ఉద్యోగులు

నగరంపాలెం: స్వాతంత్య్ర సమరంలో ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు అపూర్వ ధైర్యసాహసాలతో బ్రిటిష్ వారి దౌర్జన్యాలకు ఎదురు నిలబడ్డారని జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ అన్నారు. ప్రకాశం పంతులు జయంతి సందర్భంగా శనివారం జిల్లా పోలీస్ కార్యాలయ (డీపీఓ) ఆవరణలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జిల్లా ఎస్పీ మాట్లాడుతూ ఆంధ్రుల ఆత్మ గౌరవ పతాకధారుడు టంగుటూరి అన్నారు. ఆంధ్ర రాష్ట్ర తొలి సీఎంగా ప్రజాస్వామ్య పరిపాలనకు బలమైన పునాదులేసి, విశేష సేవలందించారని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ ఏడుకొండల రెడ్డి, ఎస్బీ సీఐలు అళహరి శ్రీనివాస్, సీహెచ్ రాంబాబు, ఆర్ఐలు సురేష్, శ్రీహరిరెడ్డి, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

స్ఫూర్తి ప్రదాత ప్రకాశం పంతులు

గుంటూరు ఎడ్యుకేషన్: స్వాతంత్య్ర సంగ్రామంలో బ్రిటిషు పాలకుల తుపాకీకి ఎదురొడ్డి నిలిచిన టంగుటూరి ప్రకాశం పంతులు తరతరాలకు స్ఫూర్తి ప్రదాత అని జెడ్పీ సీఈవో వి.జ్యోతిబసు అన్నారు. ఆంధ్ర రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి సందర్భంగా శనివారం జెడ్పీ సమావేశ మందిరంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జ్యోతిబసు మాట్లాడుతూ పేద కుటుంబంలో పుట్టినా రాష్ట్రానికి ప్రకాశం పంతులు ముఖ్యమంత్రి స్థాయికి ఎదిగారని వివరించారు. అత్యంత సాధారణ జీవనాన్ని సాగించిన ఆయన దేశభక్తి నేటి యువతకు మార్గదర్శకం కావాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ సీఈవో సీహెచ్ కృష్ణ, పరిపాలనాధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాల్లో విజిలెన్స్ తనిఖీలు



తనిఖీలు నిర్వహిస్తున్న విజిలెన్స్ అధికారులు

దుగ్గిరాల: ఎరువుల కొరత ఏర్పడుతుందని అనే అపోహతో రైతులు ఒకేసారి ఎరువులు అధిక సంఖ్యలో తీసుకెళ్లడం ద్వారా కొరత ఏర్పడుతుందని విజిలెన్స్ ఈఈ ఆర్.విజయ బాబు అన్నారు. శనివారం దుగ్గిరాల మండలం ఈమని గ్రామంలో విజిలెన్స్, అగ్రికల్చర్, ఎన్‌ఫోర్స్‌మెంట్ శాఖల అధికారులు సంయుక్తంగా ఎరువుల దుకాణాల్లో తనిఖీలు నిర్వహించారు. విజయబాబు మాట్లాడుతూ యూరియా 58 మెట్రిక్ టన్నులు, డీఏపీ 49 మెట్రిక్ టన్నులు సొసైటీలు, ప్రైవేటు డీలర్స్ వద్ద అందుబాటులో ఉందని గుర్తించామని తెలిపారు. విజిలెన్స్ ఇన్‌స్పెక్టర్స్ కె.చంద్రశేఖర్, వై.శివన్నారాయణ, విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ సిబ్బంది పాల్గొన్నారు.

వాణిజ్యం

నిమ్మకాయల ధరలు

గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్‌యార్డులో శనివారం నిమ్మకాయల క్వింటా ధర

కనిష్టం : రూ. 2,000 గరిష్టం : రూ. 2,700

మోడల్ ధర రూ. 2,300

26న జిల్లా స్థాయి ఫెన్సింగ్ జట్టు ఎంపిక

గుంటూరు వెస్ట్ (క్రీడలు): గుంటూరు ఫెన్సింగ్ స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అండర్-17 బాలబాలికలకు పోటీలను 26వ తేదీ ఉదయం 10 గంటలకు స్థానిక బీఆర్ స్టేడియంలోని జిల్లా స్పోర్ట్స్ అథారిటీ హాలులో ఏర్పాటు చేశారు. ఈ మేరకు అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి డి.అశోక్ బాబు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపిక చేసిన జట్టును ఈ నెల 30వ తేదీన పశ్చిమ గోదావరి జిల్లాలోని భీమవరంలో జరగనున్న 11వ ఏపీ స్టేట్ అంతర్ జిల్లాల ఫెన్సింగ్ చాంపియన్‌షిప్‌కు పంపిస్తామన్నారు. వివరాలకు 70755 08842 ఫోను నంబర్‌లో సంప్రదించాలన్నారు.

13న జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి

బాపట్ల అర్బన్: సెప్టెంబరు 13వ తేదీన జరిగే జాతీయ లోక్‌అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని మండల న్యాయ సేవాధికార కమిటీ చైర్మన్ కే శ్యాంబాబు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బాపట్ల కోర్టుల సముదాయంలో మండల న్యాయ సేవా కమిటీ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కోర్టులలో పెండింగ్‌లో ఉన్న అన్ని రకాల సివిల్ కేసులు, భరణం కేసులు, గృహ హింస కేసులు, మోటార్ ప్రమాద కేసులు, రెవెన్యూ కేసులు, బ్యాంకు కేసులు, చెక్ బౌన్స్ కేసులు, రాజీ పడదగిన క్రిమినల్ కేసులు, ముందస్తు రాజీ చేసుకోదలచిన కేసులు ఇరుపక్షాల మధ్య సామరస్యపూర్వకంగా రాజీ చేసి పరిష్కరించుకునేందుకు అవకాశం ఉందని తెలిపారు. కక్షిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం పరుచుకుని తమ వివాదాలను శాంతియుతంగా రాజీచేసుకుని పరిష్కరించుకోవాలని సూచించారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి



కోటేశ్వరమ్మ (ఫైల్)

సంతమాగులూరు(అద్దంకి రూరల్): బైకు మీద వెళ్తున్న భార్యాభర్తలను వెనకు నుంచి లారీ ఢీకొట్టటంతో మహిళ మృతి చెందింది. ఈ ఘటన సంతమాగులూరు మండలం రామిరెడ్డిపాలెం గ్రామం వద్ద శనివారం జరిగింది. సంతమాగులూరు ఎస్ఐ తెలిపిన వివరాల మేరకు.. వినుకొండ మండలం గోకనకొండ గ్రామానికి చెందిన గద్దల తిరుపతయ్య, అతని భార్య కోటేశ్వరమ్మ (44) బైక్‌పై కొమ్మాలపాడు నుంచి సంతమాగులూరు వైపు వస్తున్నారు. రామిరెడ్డిపాలెంలోని రామాలయం వద్దకు రాగానే వెనుక నుంచి లారీ వేగంగా వచ్చి ఢీ కొట్టింది. కోటేశ్వరమ్మకు గాయాలై అక్కడికక్కడే మృతి చెందింది. గాయాలైన తిరుపతయ్యను 108 వాహనంలో నరసరావుపేట ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ఉద్యోగం రాలేదని యువకుడి ఆత్మహత్య

చీరాల అర్బన్: ఉద్యోగం రాలేదనే మనస్తాపంతో ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన శనివారం బాపట్ల జిల్లా చీరాల ఐక్యనగర్‌లో చోటుచేసుకుంది. టూటౌన్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు ఐక్యనగర్‌కు చెందిన డి.వెంకటేశ్వర్లు (36) ఎమ్మెస్సీ బయోకెమిస్ట్రీ చేశాడు. హైదరాబాద్‌లో శిక్షణ తీసుకుని గ్రూప్స్, కానిస్టేబుల్ పోస్టులకు ప్రయత్నించినా ఉద్యోగం రాలేదు. ఉద్యోగం రాలేదని మనస్తాపానికి గురై శనివారం ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సమాచారం అందుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చీరాల ఏరియా వైద్యశాలకు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు టూటౌన్ ఎస్ఐ నాగశ్రీను తెలిపారు.

యువకుడి అదృశ్యంపై ఫిర్యాదు

చౌటుప్పల్: ఆఫీసుకు వెళ్లిన యువకుడు ఇంటికి తిరిగి రాకుండా అదృశ్యమయ్యాడు. ఈ ఘటన యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ పట్టణ కేంద్రంలో శనివారం వెలుగులోకి వచ్చింది. చౌటుప్పల్ సీఐ మన్మథకుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. పల్నాడు జిల్లా మాచవరం మండలం మోర్జంపాడు గ్రామానికి చెందిన గడిపూడి మురారి(30) హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్నాడు. మూడేళ్ల క్రితం వివాహమైంది. మూడు నెలల క్రితం గొడవ జరిగడంతో భార్య పుట్టింటికి వెళ్లిపోయింది. దీంతో మురారి యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ పట్టణ కేంద్రంలోని విద్యానగర్‌కాలనీలో నివాసముంటున్న తన అక్క కాంచన వద్దకు వచ్చాడు. రోజూ హైదరాబాద్‌లో ఆఫీస్‌కి వెళ్లి తిరిగి రాత్రికి వస్తుండేవాడు. 18న మురారి ఆఫీస్‌కి వెళ్లాడు. అదేరోజు రాత్రి అక్క ఫోన్ చేయగా.. 'బస్టాండ్ వద్ద ఉన్నాను.. ఇంటికి వస్తున్నా' అని చెప్పాడు. కానీ ఇంటికి వెళ్లలేదు. రెండు రోజులు అతడి ఫోన్ ఆన్‌లో ఉన్నప్పటికీ.. సమాధానం ఇవ్వలేదు. ఏదైనా పనిమీద ఉన్నాడేమోనని, అందుకే ఫోన్ లిఫ్ట్ చేయడం లేదని భావించిన కాంచన అంతగా పట్టించుకోలేదు. 21వ తేదీ నుంచి మురారి సెల్‌ఫోన్ స్విచ్ఛాఫ్ అయిపోయింది. ఎంత ప్రయత్నించినా మురారి గురించిన సమాచారం తెలియరాలేదు. దీంతో శనివారం మురారి అక్క కాంచన చౌటుప్పల్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని సీఐ పేర్కొన్నారు.

వైభవంగా కోటి కుంకుమార్చన



పూజలో దంపతులు, ఈఓ అశోక్ కుమార్, అర్చకుడు స్వర్ణ వెంకట శ్రీనివాస శర్మ తదితరులు

అమృతలూరు(భట్టిప్రోలు): అమృతలూరు మండలం గోవాడ శైవ క్షేత్రమైన శ్రీ గంగాపార్వతి సమేత శ్రీ బాలకోటేశ్వరస్వామి దేవస్థానంలో శ్రావణ బహుళ అమావాస్యను పురస్కరించుకుని శనివారం కోటి కుంకుమార్చన, సామూహిక లలిత పారాయణ మహోత్సవం జరిగింది. కార్యనిర్వాహణాధికారి బి. అశోక్ కుమార్ ఆధ్వర్యంలో వీటిని నిర్వహించారు. ప్రధాన అర్చకుడు స్వర్ణ వెంకట శ్రీనివాస శర్మ పూజా కార్యక్రమాలు జరిపారు. 10 లక్షల పారాయణ, కుంకుమార్చన, అమ్మవారికి శ్రీ సూక్త సహిత దేవి ఉపనిషత్తులతో అభిషేకం, కుంకుమార్చన, దేవీ హోమం, కుష్మాండ పూజ, కూష్మాండ బలి పూజా కార్యక్రమాలు జరిగాయి. పైనం రంగారెడ్డి దంపతులు అమ్మవారి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమంలో చావలి శ్రీధర్‌శర్మ, మండవ రమేష్, పావులూరి రమేష్, పావులూరి సుబ్బారావు, వరలక్ష్మి, పొన్నపల్లి సత్యన్నారాయణ, జంజనం హేమశంకరరావు, కూచిబొట్ల శ్రీనివాసశర్మ, కళ్యాణ చక్రవర్తి స్వామి, పసుపులేటి కొండల స్వామి, పడమట వెంకటేశ్వరరావు, చింతల మురళీకృష్ణ, మండవ మల్లేశ్వరి, తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమాలను కోటి కుంకుమార్చన కమిటీ, సహాయకులు పర్యవేక్షించారు.

స్వచ్ఛ రేపల్లె సాధనకు సహకరించండి

ఆర్డీవో నేలపు రామలక్ష్మి



మాట్లాడుతున్న ఆర్డీవో

రేపల్లె: స్వచ్ఛ రేపల్లె సాధనలో పట్టణ ప్రజలు భాగస్వాములు కావాలని ఆర్డీవో నేలపు రామలక్ష్మి కోరారు. స్వర్ణాంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా మున్సిపాలిటీ ఆధ్వర్యంలో పట్టణంలోని ఓల్డ్‌టౌన్ అంకమ్మ చెట్టు సెంటర్‌లో స్థానికులతో పరిసరాల పరిశుభ్రతపై శనివారం ప్రతిజ్ఞ చేయించారు. ఆర్డీవో మాట్లాడుతూ వర్షాకాలంలో సీజనల్ వ్యాధుల ప్రమాదం ఉందని, అవగాహన కలిగి ఉండాలని చెప్పారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. మురుగు కాలువలలో చెత్తను వేయరాదని, పారిశుద్ధ్య సిబ్బందికి మాత్రమే అందించాలని పేర్కొన్నారు. ఈ సందర్భంగా పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్ కే సాంబశివరావు, తహసీల్దార్ ఎం.శ్రీనివాసరావు, వైద్య సిబ్బంది, పట్టణ ప్రజలు, వివిధ పాఠశాలల విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

ఇన్‌స్పైర్ నామినేషన్లు పెంచండి

డీఈఓ పురుషోత్తం



మాట్లాడుతున్న డీఈఓ పురుషోత్తం

బాపట్ల అర్బన్: ఇన్‌స్పైర్ అవార్డుల కోసం నామినేషన్ తప్పనిసరిగా ఉండాలని డీఈఓ పురుషోత్తం తెలిపారు. రిజిస్ట్రేషన్ల ప్రక్రియ కోసం మండల నోడల్ సైన్స్ ఉపాధ్యాయులకు బాపట్ల జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయంలో శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఈఓ మాట్లాడుతూ... ప్రతి ప్రాథమికోన్నత పాఠశాల నుంచి మూడు, ఉన్నత పాఠశాల నుంచి ఐదు ప్రాజెక్టులు రిజిస్ట్రేషన్ చేయించాలని అన్నారు. అన్ని యాజమాన్య పాఠశాలలు విద్యార్థులను ప్రోత్సహించాలని సూచించారు. ప్రాజెక్టులు నూతన ఆవిష్కరణలకు దారి తీసేలా ఉండాలని, పేటెంట్ హక్కులు పొందే స్థాయి వరకు వెళ్లే విధంగా విద్యార్థులకు తగిన తర్ఫీదు ఇవ్వాలన్నారు. మట్టిలోని మాణిక్యాలను వెలికి తీయడమే ఉపాధ్యాయుల కర్తవ్యం కావాలని పేర్కొన్నారు. ప్రత్యేక శ్రద్ధ తీసుకొని సెప్టెంబర్ 15వ తేదీలోపు బాపట్ల జిల్లా నుంచి గరిష్ఠంగా నామినేషన్లు నమోదు అయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశానికి హాజరైన నోడల్ సైన్స్ ఉపాధ్యాయులు వెంటనే తమ మండలాల్లోని అన్ని పాఠశాలలు రిజిస్టర్ అయ్యేట్లు చూడవలసినదిగా ఆదేశించారు. జిల్లా సైన్స్ అధికారి మహమ్మద్ సాదిక్, నోడల్ టీచర్లు పాల్గొన్నారు.

మైనార్టీల అభివృద్ధికి ప్రభుత్వం కృషి

కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్



మాట్లాడుతున్న డాక్టర్ పెమ్మసాని

గుంటూరు వెస్ట్: మైనార్టీల అభివృద్ధికి కేంద్రం కృషి చేస్తున్నట్లు కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు. శనివారం స్థానిక కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ మినీ సమావేశ మందిరంలో పీఎంజేవీకే, సూర్యఘర్, టూరిజం అభివృద్ధిపై జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి, తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే మొహమ్మద్ నసీర్ అహ్మద్, జిల్లా అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. అనంతరం మాట్లాడుతూ పీఎంజేవీకే పథకం 25 శాతం మైనార్టీలున్న ప్రాంతాల్లోనే సాధ్యమన్నారు. గుంటూరు తూర్పు నియోజకవర్గం దీనికి ఎంపికైందని తెలిపారు. సూర్యఘర్ పథకం కింద గుంటూరు పార్లమెంటు పరిధిలో 1.16 లక్షల మంది నమోదు అయ్యారన్నారు. 3,600 మంది ఉపయోగించుకుని లబ్ధి పొందారని పేర్కొన్నారు. జిల్లాలో టూరిజం అభివృద్ధిపై దృష్టి పెట్టాలని ఆదేశించారు. ఎన్టీఆర్ మానస సరోవరం, పేరేచర్ల వద్ద ఉన్న నందనవనం, ఉండవల్లి గుహలు, ఉప్పలపాడు విదేశీ పక్షుల కేంద్రం తదితరాల అభివృద్ధికి కేంద్రం నుంచి నిధులు కోరుతామన్నారు. సమావేశంలో డీఆర్వో షేక్ ఖాజావలి, సీపీఓ శేషశ్రీ, జిల్లా టూరిజం అధికారి శ్రీరమ్య, ఎల్డీఎం మహిపాల్ రెడ్డి అధికారులు పాల్గొన్నారు.

కౌలు రైతులకూ అన్నదాత సుఖీభవ వర్తింపచేయాలి



మాట్లాడుతున్న కౌలు రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి కె.హరిబాబు

లక్ష్మీపురం (గుంటూరు): రాష్ట్రంలో 60 నుంచి 70 శాతం కౌలు రైతులే ఉన్నా గుర్తింపు కార్డులు, పంట రుణాలు ఇవ్వడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమయిందని కౌలు రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి కె.హరిబాబు ఆరోపించారు. వారికి అన్నదాత సుఖీభవ వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. గుంటూరు బ్రాడీపేటలోని సంఘం జిల్లా కార్యాలయంలో శనివారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కౌలు రైతులకు గుర్తింపు కార్డు ఇవ్వాలంటే భూ యజమాని సంతకం చేయాలనే నిబంధన వల్ల కార్డులు రాలేదన్నారు. పంట రుణాలు ఇవ్వడంలో ప్రభుత్వం విఫలం అయిందన్నారు. స్పందించి వారి సమస్యలు పరిష్కరించకుంటే ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు. సమావేశంలో కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఎం. నాగమల్లేశ్వరరావు, కౌలు రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి పాశం రామారావు, కౌలు రైతు సంఘం జిల్లా నాయకులు ఎం.సాంబిరెడ్డి, పి.కృష్ణ, అమ్మిరెడ్డి, వై.నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సీనియార్టీ జాబితా రూపకల్పనకు వినతి



మున్సిపల్ ఆర్డీ హరికృష్ణకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

నెహ్రూనగర్: గుంటూరు జోనల్ పరిధిలోని ఉద్యోగుల సీనియార్టీ జాబితాను రూపొందించాలని ఆంధ్రప్రదేశ్ గ్రామ వార్డు సచివాలయ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు షేక్ అబ్దుల్ రజాక్ కోరారు. ఈ మేరకు శనివారం బ్రాడీపేటలోని మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అర్బన్ డెవలప్‌మెంట్ రీజినల్ డైరెక్టర్ ఎస్. హరికృష్ణను ఆయన చాంబర్‌లో కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వార్డు సచివాలయ ఉద్యోగులందరి సీనియార్టీ జాబితాను జూలై 31వ తేదీ లోపు రూపొందించాలని మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ డైరెక్టర్ ఆదేశాలు ఇచ్చినట్లు గుర్తుచేశారు. అనేకచోట్ల ఇది అమలు కాలేదని చెప్పారు. పారదర్శకంగా జాబితాను సిద్ధం చేయాలని కోరారు. వచ్చే పది రోజుల్లోపు గుంటూరు రీజియన్‌లోని ఉమ్మడి గుంటూరు, నెల్లూరు, ప్రకాశం జిల్లాల పరిధిలో పనిచేస్తున్న వారి జాబితాను రూపొందించి, అభ్యంతరాలను పరిగణలోకి తీసుకుంటామని ఆర్డీ పేర్కొన్నట్లు రజాక్ తెలిపారు. తుది సీనియార్టీ జాబితాను రూపొందించి మున్సిపల్ డైరెక్టర్ కార్యాలయానికి, ఉద్యోగులకు అందిస్తామని చెప్పినట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో సంఘ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి పార్సా మధు, సంఘ నగర నాయకులు అంకారావు, సందీప్ తదితరులు పాల్గొన్నారు.